క్లుప్తంగా

పిల్లలకు దానగుణాన్ని అలవర్చాలి



గుంటూరు ఎడ్యుకేషన్: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు, సంస్కారంతో పాటు దానగుణాన్ని అలవర్చాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్తంభాల గరువులోని నారాయణ స్కూల్లో శనివారం థాంక్స్ గివింగ్ డే నిర్వహించారు. ఈసందర్భంగా పట్టాభిపురంలోని అనురాగ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాలు, పండ్లు, బ్రెడ్ తదితర సామగ్రిని అందజేశారు. పాఠశాల ఏజీఎం జానకిరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఈ–కిడ్స్ సమన్వయకర్త షమీమ్, ఏవో జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.అమూల్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం సరఫరా ఉండదని గుంటూరు– 4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హెచ్.ఖాన్, ఏఈ రవికుమార్ శనివారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. ఆటోనగర్ ఫేజ్ 1–2, 3 – 4 ఫీడర్స్ పరిధిలోని విశ్వనాథ్ హోటల్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచార కమిషనర్లుగా సమర్థులనే నియమించాలి

లక్ష్మీపురం: పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే సమాచార హక్కు చట్టం సక్రమంగా అమలు కావాలంటే సమర్థులైన వారినే సమాచార కమిషనర్లుగా నియమించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు' అనే అంశంపై సమావేశం శనివారం నిర్వహించారు. సమాచార హక్కు ఉద్యమ నేత పి.భావన్నారాయణ మాట్లాడుతూ కమిషనర్లు లేకపోవడం వల్ల జూన్ నెలాఖరుకు దేశ వ్యాప్తంగా సమాచార కమిషన్లలో నాలుగు లక్షలకు పైగా రెండో అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు వెంకటరత్నం, కష్టారావు, ప్రసాద్ ప్రసంగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం(వెస్ట్): ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన దారా జాషువా బ్రాడీపేట 3/1వ లైన్‌లోని ఓ హోటల్‌లో పని చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి పని పూర్తి చేసుకుని రాత్రి ఇంటి ముందు ఉన్న చెట్టు కింద పార్కింగ్ చేశాడు. ఉదయాన్నే లేచి చూసే సరికి బుల్లెట్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల పరిశీలించగా ఎంతకు కనిపించక పోవడంతో శనివారం రాత్రి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

లక్ష్మీపురం: ఇంటి నుంచి బయటకు వచ్చి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న రూ.1.30 లక్షల విలువ చేసే 65 గ్రాముల బంగారం నల్లపూసల గొలుసు, తాళిబొట్టును లాక్కొని పరారైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. చంద్రమౌళినగర్ 7/1వ లైన్ సాయి సుదర్శన్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కొడాలి విజయలక్ష్మి శనివారం సాయంత్రం 5.50 గంటల సమయంలో చంద్రమౌళినగర్ 7/3వ లైన్‌లోని డ్రై ఫ్రూట్స్ కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి కాలినడకన బయలుదేరారు. బిగ్‌బజార్ సమీపంలోకి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న 65 గ్రాముల బంగారు తాళిబొట్టు, నల్లపూసల గొలుసును లాక్కొని వేగంగా పరారయ్యాడు. స్థానికులు పట్టుకునే యత్నం చేసిన తప్పించుకుని వెళ్లి పోయాడు. దీంతో బాధితురాలు పోలీసులకు సమాచారం తెలియజేయగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ పరమేశ్వరి సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ వైద్య విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ కె.పరమేశ్వరి శనివారం పదవీ విరమణ చేశారు. ఈసందర్భంగా ఆమెను వైద్య కళాశాల అధికారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ ఆమె సేవలను కొనియాడారు.


వీడితే అపోహలు.. బతుకులో వెలుగులు!

ఆధునిక వైద్యంతో హెచ్ఐవీ బాధితులకు అభయం

- అందుబాటులోకి ఆధునిక ఇంజక్షన్
- మందులతో పనిలేకుండా జీవితకాలం పొడిగింపు
- పుట్టబోయే పిల్లలకు సోకకుండా చేసే అవకాశం

హెచ్ఐవీ సోకగానే నయం కాదని, చనిపోవటం ఖాయమని నమ్మే జనం స్మార్ట్ ఫోన్ యుగంలో కూడా ఉన్నారు. వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెంది ఆధునిక సేవలు అందుబాటులోకి వచ్చినా ఈ వ్యాధిపై అనుమానాలు, భయాలు ప్రజల్లో పూర్తిగా తొలగిపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువ. వస్తావానికి నేడు ఎన్నో వైద్య సేవలు ఉచితంగా లభిస్తున్నాయి. బాధితుల జీవిత కాలాన్ని పెంచుతున్నాయి. 1986లో తమిళనాడులో ఎయిడ్స్ సోకిన వ్యక్తిని దేశంలో మొట్టమొదటిసారిగా గుర్తించారు. వరల్డ్ ఎయిడ్స్ డేను 1988 నుంచి ప్రతి ఏడాది డిసెంబర్ 1న నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి – నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదంతో ఎయిడ్స్ డే జరుపుతున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: హ్యూమన్ ఇమ్యూనో డెఫిషెన్సీ సిండ్రోమ్‌ను హెచ్ఐవీ అంటారు. మానవుడిలో రోగ నిరోధక శక్తిని తగ్గించే ఒక రకమైన వైరస్ దీనికి కారణం. సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారా ఇది సోకుతుంది. వైరస్ సోకిన వారి రక్తం ఇతరులకు ఎక్కించటం ద్వారా వ్యాపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 2023 లెక్కల ప్రకారం 39.9 మిలియన్ల మంది, భారత్‌లో 24 లక్షల మంది, ఏపీలో 3.14 లక్షల మంది, జిల్లాలో 10,579 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారు. వ్యాధి



సోకకుండా సంభోగ సమయంలో తప్పనిసరిగా కండోమ్ వాడాలి. అవసరమైన ప్రతిసారి కొత్త సూదులు, సిరంజులు, బ్లేడ్లు ఉపయోగించాలి.

సంవత్సరం	పరీక్షలు చేయించుకున్న వారు	బాధితుల సంఖ్య	శాతం
2017-18	58,671	2,054	3.50
2018-19	88,644	1710	1.93
2019-20	79,369	1,224	1.54
2020-21	39,903	686	0.72
2021-22	96,439	1152	1.19
2022-23	98,092	747	0.76
2023-24	1,04, 900	1105	-

(నవంబరు వరకు)

హెచ్ఐవీ సోకని వారి రక్తాన్ని మాత్రమే పరీక్షలు చేసి ఇతరులకు ఎక్కించాలి.

బాధితులకు ఉచిత వైద్య సేవలు

హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సౌకర్యాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా హెచ్ఐవీ నిర్ధారణ చేసేందుకు సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాలు (ఐసీటీసీ) పది ఉన్నాయి. జిల్లాలోని 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు జిల్లాలో యాంటి రెట్రోవైరల్ చికిత్స కేంద్రాలు (ఏఆర్టీ) ఐదు ఉన్నాయి. జిల్లాలో హెచ్ఐవీ పరీక్షలు, బాధితుల సంఖ్య సంవత్సరాలవారీగా పట్టికలో చూడొచ్చు.

సేవలు వినియోగించుకోవాలి



హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాం. హెచ్ఐవీ సోకిన మహిళకు పుట్టుబోయే బిడ్డకు వ్యాధి లేకుండా నియంత్రించేందుకు నేడు అనేక ఆధునిక మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ఆదివారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ వరకు అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశాం. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు ఉంటుంది.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో, గుంటూరు

ఏడాదికి రెండు ఇంజక్షన్లతో అడ్డుకట్ట



ఏడాదికి రెండు సార్లు ఇంజక్షన్‌తో హెచ్ఐవీకి అడ్డుకట్ట వేయవచ్చు. 2030 కల్లా ప్రపంచంలో హెచ్ఐవీని అంతమొందించాలనే లక్ష్యానికి మెట్టుగా దీనిని అభివర్ణించవచ్చు. కొన్ని సంవత్సరాలుగా రోజుకి కేవలం ఒక మందు బిళ్ల వాడటం ద్వారా శరీరంలో గుర్తించలేని, ప్రసారం చేయలేని స్థాయికి హెచ్ఐవీ వైరస్‌ను నియంత్రించటం జరిగింది. దీని వల్ల కొత్త ఇన్ఫెక్షన్లు తగ్గటంతోపాటు హెచ్ఐవీ ఉన్నవారు సాధారణ జీవితానికి దగ్గరయ్యారు. జీవిత భాగస్వామికి వైరస్ సోకకపోవడమే కాకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. పిల్లలు కనడానికి ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదు. లెంకపావిర్ అనే ఇంజక్షన్ ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో అందుబాటులోకి వచ్చింది. వచ్చే ఏడాది మన దేశంలో కూడా అందుబాటులోకి వస్తుంది.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణ చేయడానికి, ప్రజారోగ్య కార్మికుల సంక్షేమానికి జీఎంసీ కృషి చేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ ఇంటింటి చెత్త సేకరణ కోసం సిద్ధం చేసిన పుష్ కాట్స్, డంపర్ బిన్లు, ఈ–ఆటోలను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌లతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నామని చెప్పారు. నగరంలోని 2.80 లక్షల ఇళ్ల నుంచి 8 వందల మైక్రో పాకెట్స్ ద్వారా నూరు శాతం చెత్త సేకరణకు జీఎంసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారని, అందులో భాగంగా శనివారం వంద పుష్ కాట్స్, 8 వందల బిన్లను, 30 పెద్ద కాంపాక్టర్ బిన్లను కమిషనర్ సిద్ధం చేయించారని, త్వరలో 19 ట్రాక్టర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, డెప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, కార్పొరేటర్లు ఈ.వరప్రసాద్, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పుష్‌కార్ట్స్, డస్ట్‌బిన్ల పంపిణీని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

యుగకర్త గురజాడ

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యంలో గురజాడ వెంకట అప్పారావు యుగకర్తగా చరిత్రలో నిలిచారని ప్రముఖ కవి, తెలుగు భాషా పండితుడు జీఎస్ చలం పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ఆడిటోరియంలో శనివారం గురజాడ వెంకట అప్పారావు వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా జీఎస్ చలం మాట్లాడుతూ గురజాడ రచించిన నాటకాలను గురించి ప్రస్తావిస్తూ, యుగకర్తగా గురజాడ సాహిత్యాన్ని విశ్లేషించారు. ఆయన కథల్లోని ముఖ్యమైన అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ తెలుగు– ఆంగ్ల సాహిత్యాల తారతమ్యం, ఆంగ్ల కవుల సాహితీ గమనాన్ని తీసుకున్న మన తెలుగు కవులు తెలుగు సాహిత్యాన్ని ముందుకు నడిపించారని అన్నారు. పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వ్యావహారిక భాషకు గొప్ప ఖ్యాతిని ఆర్జించిన ఘనుడు గురజాడ అని పేర్కొన్నారు. ఇదే రోజు భాషా పరిరక్షణ దినోత్సవం అని అన్నారు.



జీఎస్ చలంను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ గోపీచంద్, అధ్యాపకులు

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ హెచ్చరించారు. ఈనెల 29 సాయంత్రం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20 వాహనాలకు సంబంధించి వాహనాలు డ్రైవ్ చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వెస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యతో కలసి డీఎస్పీ రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్నేక్ డ్రైవ్, ర్యాష్ డ్రైవ్, త్రిపుల్ డ్రైవ్ వలన జరిగే నష్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ అతివేగం, అజాగ్రత్త వల్ల మనతోపాటు, తోటి వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అలాంటి డ్రైవింగ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇష్టానుసారంగా వాహనాలు డ్రైవ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. వాహనాలు పిల్లలకు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పడంతోపాటు, ధ్రువీకరణ పత్రాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం 20 ద్విచక్ర వాహనాలకు సంబంధించి జరిమానా విధించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ సింగయ్య

ఏఎన్‌యూలో ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

వైఎస్సార్‌ఎస్‌యూ ఆరోపణ

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మహిళా వసతి గృహాల్లో విద్యార్థినుల భోజనంలో జెర్రిలు, కప్ప, పురుగులు వచ్చిన ఘటనకు కూటమి ప్రభుత్వ నిర్లక్షమే ప్రధాన కారణమని వైఎస్సార్ విద్యార్థి సంఘం(వైఎస్సార్‌ఎస్‌యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వీసీని కోరారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థినుల భోజనంలో కప్ప రాలేదనీ, భోజనం కలుషితం కాలేదని వీసీ చెప్పడం తగదన్నారు. విద్యార్థినులు తినే భోజనంలో కప్ప రాకుంటే వేలాదిమంది విద్యార్థినిలు వీసీ భవనం ముందు ఎందుకు ధర్నా చేశారని ప్రశ్నించారు. విశ్వ విద్యాలయాలను కూటమి ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తుందో ఈ ఘటనే నిదర్శనమన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు కె.శివారెడ్డి,ఐ శ్రీనివాస్,ఎస్.ప్రతాప్, యస్వంత్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.



ఏఎన్‌యూ వీసీ గంగాధరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

గుంటూరు మెడికల్: ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగులకు కమ్యుటేషన్ గరిష్ట కాలపరిమితి 15 సంవత్సరాల నుంచి 11 సంవత్సరాల 3 నెలలకు తగ్గించడాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా స్వాగతించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో శనివారం చాంద్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు గా 45 వేల మంది ప్రభుత్వ పింఛన్ దారులకు, విశ్రాంతి ఉద్యోగులకు మేలు జరుగిందన్నారు. భవిష్యత్‌లో పదవీ విరమణ కాబోయే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

లక్ష్మీపురం: మనస్తాపంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. మారుతినగర్ 3వ లైన్ ప్రాంతానికి చెందిన కేసాని పద్మజ(50), నరసరావుపేటలోని ఓ ఆస్పత్రిలో మూడేళ్లగా మేనేజర్‌గా పని చేస్తుండగా కొడుకు వెంకటసాయిరాం కూడా అక్కడే పనిచేస్తున్నాడు. అయితే కొంత కాలం కిందట కోడలికి గుంటూరులో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. దీంతో వెంకటసాయిరాం భార్య గుంటూరు– నరసరావుపేట జర్నీ చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో వెంకటసాయిరాం, భార్య ఇద్దరు కలసి గుంటూరు మారుతీ నగర్‌లోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఈ క్రమంలో వెంకటసాయిరాం తల్లి కూడా నరసరావుపేటలో ఉద్యోగం మానేసి గుంటూరు మారుతీనగర్‌లో నివాసం ఉంటున్నారు. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు కేసాని పద్మజ, కుమారుడు వెంకటసాయిరాంలను ఇద్దరు పిలిపించి చెప్పా పెట్టకుండా మానేయడం సరి కాదని ఆస్పత్రిలో రూ.50 లక్షల వరకు తప్పుడు లెక్కలు రాసి ఉన్నాయని లెక్కలు తెల్చాలని చెప్పి బెదిరింపులకు దిగారు. దీంతో కేసాని పద్మజ మనస్తాపానికి లోనై ఈనెల 25వ తేదీన ఎలుకల మందు తిని, బాపట్లలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈనెల 29వ తేదీన కేసాని పద్మజకు విపరీతంగా కడుపులో నొప్పి రావడంతో ఎలుకల పేస్ట్ తిన్నట్లు చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి, మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ ఏటీ అగ్రహారం, శ్రీరామ్ నగర్ మెయిన్ రోడ్, కేవీపీ కాలనీ, సాయి నగర్, ఏసు భక్త నగర్, చుట్ట గుంట సెంటర్, రామనామ క్షేత్రం రోడ్, సంపత్ నగర్ ఎక్స్ టెన్షన్ ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి పనులను, ఎస్వీఎస్ కాలనీలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చుట్టగుంట వాకింగ్ ట్రాక్ చుట్టూ లైట్లు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, ట్రాక్ పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు వెంకటేశ్వరరావు, రెహ్మాన్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించాలని వినతి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక నిర్వహించాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ రామనబోయిన అజయ్, కో ఆప్షన్ మెంబర్ పూనూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు నగర కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నిక కాల పరిమితి గడువు 3 నెలలు గడిచిన ఇంత వరకు ఎటువంటి ఎన్నిక జరపలేదన్నారు. వెంటనే స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరిపేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అదే విధంగా నగర పాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేటర్లకు కేటాయించిన రూముల్లో కనీస మౌలిక వసతులు లేవని... వాటిని కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్‌కు వినతిపత్రం అందించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టే రాజు, మర్రి సత్యనారాయణ ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

అలరించిన శివుని కీర్తనల గానం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం శివుని కీర్తనల గానం నిర్వహించారు. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతలపాటి రమాగోపాలకృష్ణ బృందం కార్తిక మాసం సందర్భంగా శ్రీసామవేదం షణ్ముఖశర్మ రచించిన శివపదంలోని శివుని కీర్తనల గానం కొనసాగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీమణులు రమాగోపాలకృష్ణ, అంజనీదేవి, నాగలక్ష్మి, పావని కీర్తనలు అలపించారు.

గురజాడకు ఘన నివాళి

లక్ష్మీపురం: గురజాడ అప్పారావు గొప్ప సంఘసంస్కర్త అని ఐద్వా నగర అధ్యక్షురాలు జి.రమణ అన్నారు. స్థానిక పుచ్చపల్లి సుందరయ్య నగర్‌లోని ఐద్వా ఏరియా కమిటీ కార్యదర్శి ఖాజాబీ అధ్యక్షతన గురజాడ వర్ధంతి శనివారం సాయంత్రం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నూర్జహాన్, అచ్యుత కుమారి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు డిసెంబర్ 5 వరకే గడువు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులకు నూతన గుర్తింపు కార్డుల దరఖాస్తులు స్వీకరణకు డిసెంబర్ 5వ తేదీతో గడువు ముగుస్తుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఇచ్చే గుర్తింపు కార్డులే ప్రామాణికమని.. నగరంలోని ప్రతి వీధి వ్యాపారి నగరపాలక సంస్థ ప్రధాన, సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

రిషితేశ్వరికి దక్కని న్యాయం

ఏఎన్‌యూ: రిషితేశ్వరి ఆత్మహత్య కేసు తీర్పుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే నమిత మాట్లాడుతూ ఏఎన్‌యూలో 2015 జూలై 14వ తేదీన ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని చనిపోయిందని చెప్పారు. సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా సూసైడ్ నోట్ రాసి చనిపోయిందని పేర్కొన్నారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులను, అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాబూరావుని నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి కేసు నడచిందని, ఆ కేసును కొట్టివేస్తూ జిల్లా నాయస్థానం తీర్పు ఇవ్వడం బాధాకరమన్నారు. తక్షణమే రిషితేశ్వరి కేసులో నిందితులను శిక్షించాలని ప్రభుత్వం హైకోర్టుకి అపీల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఎం.కిరణ్, కె. రూపస్ పాల్గొన్నారు.

డెర్మటాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ హవా

- డాక్టర్ సోమేష్ గుప్తా
- డెర్మటాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం

గుంటూరు మెడికల్: డెర్మటాలజీ వైద్య విభాగంలో రాబోయే కాలమంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ హవా కొనసాగనుందని న్యూ ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన ప్రముఖ డెర్మటాలజిస్ట్ డాక్టర్ సోమేష్ గుప్తా అన్నారు. శనివారం గుంటూరు శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డెర్మటాలజీ, ఐఏడీవీఎల్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 43వ వార్షిక సదస్సు ప్రారంభమైంది. సదస్సులో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఎచ్యూమెంట్ అండ్ ఛాలంజెస్ అనే అంశంపై డాక్టర్ సోమేష్ గుప్తా, డాక్టర్ బి.వి.సత్యనారాయణ ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మ వ్యాధుల నిర్ధారణలో కూడా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కీలకంగా మారబోతుందని చెప్పారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలు వైదులు ఏవిధంగా అధిగమించాలి అనే అంశాలపై వివరించారు. లెప్రసీలో వస్తున్న ఆధునిక చికిత్సలు, లేజర్ చికిత్సల గురించి, నల్లమచ్చలు, తెల్లమచ్చలు, ఇతర చర్మ వ్యాధుల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. ఐఏడీవీఎల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తమ సంఘం జాతీయ శాఖ పిలుపు మేరకు 'చలో పాఠశాల' కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు చర్మ వ్యాధులపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన తీరును వివరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సౌజన్య అకడమిక్స్ గురించి వివరించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్, జాతీయ సెక్రటరీ డాక్టర్ భూమేష్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ వైద్య సేవలు బాగా పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 700 మందికి పైగా హాజరయ్యారు. పీజీ వైద్యులు 250 మంది పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు సైంటిఫిక్ కమిటి చైర్ పర్సన్ డాక్టర్ కె.ఎ.సీతారామ్, కో చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఎస్.మోహన్‌రావు, ఐఏడీవీఎల్ ట్రెజరర్ డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



డాక్టర్ సోమేష్ గుప్తాను సన్మానిస్తున్న చర్మ వైద్యుల సంఘం నాయకులు

సీనియర్ వైద్యులకు సన్మానం

గుంటూరు నగరంలో డెర్మటాలజీ వైద్యంలో విశేష సేవలందించిన డాక్టర్ పి.నాగేశ్వరమ్మ, డాక్టర్ వై.కృష్ణమూర్తి, డాక్టర్ రామూర్తి, డాక్టర్ నారాయణ రావులను ఘనంగా సన్మానించారు.

ఏసీ బస్సు ప్రయాణికులకు రాయితీ

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం. రవికాంత్ తెలిపారు. ఆదివారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు అమలు చేస్తున్నట్లు చెప్పారు. బస్సులలో అమరావతి స్కానియాకు 20 శాతం, ఇంద్ర బస్సులకు 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గుంటూరు నుంచి బీహెచ్ఈఎల్ వయా మంగళగిరి మీదుగా వెళ్లే అమరావతి స్కానియా బస్సుకు సంబంధించి రూ.870 గతంలో ఉండగా ఈనెల రూ.720, గుంటూరు– బీహెచ్ఈఎల్ వయా విజయవాడ అమరావతి స్కానియా రూ.970 గతంలో ఉండగా, ఈ నెల రూ.800లకే ప్రయాణించవచ్చని తెలిపారు. గుంటూరు బీహెచ్ఈఎల్‌కు వయా మంగళగిరి(ఇంద్ర)కు గతంలో రూ.700 ఉండగా, ఈ నెలలో రూ.640, బెంగళూరుకు రూ.1460 గతంలో ఉండగా, ఇప్పుడు రూ.1, 330, తెనాలి నుంచి బీహెచ్ఈఎల్(ఇంద్ర)కు గతంలో రూ.770 ఉండగా, ఇప్పుడు రూ.710, తెనాలి నుంచి విశాఖపట్నం గతంలో రూ.970 ఉండగా, ఈ నెల రూ.880లకే తీసుకుని వెళ్తున్నట్లు తెలిపారు. కేవలం ఈ నెల రోజుల మాత్రమే ఉండే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం రవికాంత్ కోరారు.